గ్రంథాలయ భవన నిర్మాణ పనులు షురూ

- వేగంగా నరసాపురం గ్రంథాలయ నిర్మాణం
- రూ.1.28 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- కాటన్ పార్కు వద్ద మూడంతస్తుల భవనం

నరసాపురం: డివిజన్ కేంద్రం నరసాపురంలో ఉన్న గ్రేడ్–1 గ్రంథాలయానికి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో సొంత భవనం సమకూరుతుంది. రూ.1.28 కోట్లుతో గత ఏడాది సెప్టెంబర్ 5న గ్రంథాలయ భవనానికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణతో కలిసి ముదునూరి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయడంతో పనులు ప్రారంభించారు. 6 నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని ముదునూరి అధికారులను ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉండడంతో పనులు శరవేగంగా సాగనున్నాయి. 1954లో ఏర్పడిన గ్రంథాలయానికి సొంత భవనం కానీ, సదుపాయాలుకానీ ఇప్పటి వరకూ లేవు. దీంతో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వేస్టేషన్‌రోడ్డులోని కాటన్‌పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించి పనులు ప్రారంభించారు. అన్ని హంగులతో మూడంతస్తుల్లో గ్రంథాలయం భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే భవనమే అసలు సమస్య. అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో, ఆరు బయట పుస్తకాలు చదవాల్సిన పరిస్థితి.


కాటన్‌పార్కు వద్ద ప్రారంభమైన కొత్త లైబ్రరీ భవన నిర్మాణ పనులు


అద్దె భవనంలో ఉన్న నరసాపురం శాఖా గ్రంథాలయం

70 ఏళ్ల సమస్యకు మోక్షం

1954 నుంచి పట్టణంలోని అనేక అద్దె భవనాల్లో లైబ్రరీ మారుతూ వచ్చింది. ప్రస్తుతం శారదా థియేటర్ వద్ద అద్దె భవనంలో కొనసాగుతోంది. లైబ్రరీని అద్దె భవనం నుంచి తప్పించి సొంత అడ్రస్ సమకూర్చాలనే ప్రయత్నం గత పాలకులు, ప్రభుత్వాలు చేయనే లేదు. గత టీడీపీ హయంలో కూడా నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై కూడా దృష్టి పెట్టని దారుణ పరిస్థితి. దాదాపు 70 ఏళ్ల సమస్యకు ముదునూరి ప్రసాదరాజు పరిష్కారం చూపించారు. ఇప్పటికే ఇటు బస్టాండ్ రోడ్డు నుంచి కాటన్‌పార్కుకు వెళ్లే మార్గంలో కాలువపై వంతెన నిర్మించబోతున్నారు. ఇప్పుడు కాటన్‌పార్కు వద్దే లైబ్రరీ కడుతున్నారు. దీంతో బస్టాండ్‌లోని ప్రయాణికులు కూడా లైబ్రరీకి నేరుగా చేరుకోవచ్చు.

అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం



నరసాపురం లైబ్రరీ పురాతనమైంది. మున్సిపాలిటీ ఏర్పడక రెండేళ్ల ముందే ఇక్కడ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ సొంత భవనం లేకపోవడం భాధాకరం. ఇప్పుడు కొత్తగా నిర్మించబోయే భవనంలో అన్ని వసతులు ఏర్పాటు చేయించి, భవిష్యత్‌లో డిజిటల్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తాం. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తవుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

క్లుప్తంగా

గీత కార్మికులకు సీఎం జగన్‌తోనే మేలు


మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం చెల్లించే ఎక్స్‌గ్రేషియాను పెంచుతూ జీఓ విడుదల చేసి గీత కార్మికుల కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు జీవో నెం.1228ను విడుదల చేసి గీత కార్మికుల పట్ల ఎంతో ఉదారత చూపించారని వివరించారు. గతంలో గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించేవారని గుర్తు చేశారు. ఆ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచి గీత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. జీవో విడుదల చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గీత కార్మిక కుటుంబాలు అండగా నిలవాలని కోరారు.

నైపుణ్యత సాధించాలి

పెనుగొండ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ నైపుణ్యత సాధించాలని పెనుగొండ విశ్వతేజ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పెనుమంట్ర బ్లాక్ పెనుగొండలోని విశ్వతేజలో విద్యార్థులకు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, చైర్ బహూకరణ

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1997–98 బ్యాచ్ విద్యార్థులు ప్రింటర్, చైర్‌ను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ మూర్తి రాజుకు అందించారు. బహూకరించిన వాటిని పాఠశాల అవసరాలకు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రామరాజు, బి.ప్రసాద్, బ్రహ్మయ్య, వై.జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జాన్‌లియో

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థినుల్లో రక్తహీనతను నిర్ధారించడానికి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించామని వీవర్స్ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జాన్ లియో తెలిపారు. గురువారం స్థానిక బీవీఆర్ఎంవీ ఉన్నత పాఠశాలలో 10 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జాన్ లియో మాట్లాడుతూ రక్తహీనత కలిగిన విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఝూన్సీలక్ష్మీబాయి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ


ఉలిశెట్టివారి ఆత్మీయ సమ్మేళనంలో పాదపూజ చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సంక్రాంతి నేపథ్యం నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలలో స్థిరపడిన ఉలిశెట్టి కుటుంబ సభ్యులంతా ఒక్క చోటకు చేరారు. గ్రామానికి చెందిన ఉలిశెట్టి శ్రీనివాసు, నాగరాజు ఆధ్వర్యంలో ఉలిశెట్టి కుటుంబాల 3వ ఆత్మీయ కలయికను స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పెద్దలు, తల్లిదండ్రులందరికీ ఉలిశెట్టి సోదరులు పా దపూజను నిర్వహించారు. పేదలకు పలు సహాయ సహకారాలను అందించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మందికి పైగా ఈ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు.

చోరీ ఘటనపై ఎస్పీ విచారణ


గుమ్మలూరులో విచారణ చేస్తున్న పోలీసులు

పోడూరు: గుమ్మలూరులో తాళం వేసి ఉన్న ఇంట్లో ఇటీవల భారీ చోరీ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ యండమూరి వెంకట్రావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. దాదాపు 118 కాసుల బంగారు ఆభరణాలు, సుమారుగా రూ.7 లక్షల నగదు చోరీ జరిగింది. బాధితుల పిర్యాధు మేరకు స్థానిక ఎస్సై వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు. చోరీ ఘటనపై గురువారం జిల్లా ఎస్పీ రవిప్రకాష్, నరసాపురం డీఎస్పీ మనోహరాచారి గురువారం గ్రామానికి వచ్చి విచారణ చేశారు. వారి వెంట సీఐ కె.శ్రీనివాస్‌కుమార్ ఉన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి


పెనుమంట్ర దళితవాడలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి లబ్ధిదారునికి వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంను చేయాలని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం పెనుమంట్రలోని దళితవాడ, పెదచెరువుగట్లు, రాజీవ్ కాలనీ ప్రాంతాలలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు ఇస్తున్న బూటకపు వాగ్దానాలు, మాయమాటలు విని ప్రజలు మోసపోవద్దని రాష్ట్రంలో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనితనం చూసి తిరిగి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, సోషల్ మీడియా మాజీ కన్వీనర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, రాష్ట్ర స్పిన్‌స్ప్రెడ్ డైరెక్టర్ పి.రామచంద్రరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈది అనితా ప్రవీణ్, వాసంశెట్టి కిరణ్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్‌రెడ్డి, సర్పంచ్ పాలిపర్తి ప్రియాంక, ఉప సర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, పెనుమంట్ర, మార్టేరు ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, ఓడూరి సర్పంచ్ బుర్రా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు స్ఫూర్తిదాయకం

పెనుమంట్ర: వేమన పద్యాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి , మార్టేరు ఎంపీటీసీ సభ్యుడు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి అన్నారు. గురువారం మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాలలో వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించి, గురవులను సత్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలు అన్నివర్గాలను ప్రభావితం చేసేవిధంగా ఉన్నాయన్నారు. వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, పాఠశాల హెచ్ఎం సీహెచ్ శివజ్యోతి, కర్రి కృష్ణారెడ్డి, రిటైర్డు తహసీల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, చింతా ధర్మవీరనారాయణ రెడ్డి, గుడిమెట్ల రామారెడ్డి పాల్గొన్నారు.


మార్టేరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గుడిమెట్ల లక్ష్మణరెడ్డి


పాలకొల్లులో వేమన జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో యోగి వేమన జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాల ఆవరణలో యోగి వేమన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ లోకనీతులు, సామాజిక చైతన్యం కలిగి ఉండుటం వేమన పద్యాల లక్షణమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోకల జనార్దన్, ఉపాధ్యాయులు శశికళ, చంద్రకళ, బొక్కా భవానీ దుర్గ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

దిగమర్రులో..

పాలకొల్లు అర్బన్: సమాజంలో నెలకొన్న అసమానతలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తన పద్యాలతో జనాన్ని జాగృతం చేసిన గొప్ప సంఘ సంస్కర్త యోగి వేమన అని దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం షేక్ పీర్ సాహెబ్ అన్నారు. గురువారం యోగి వేమన జయంతి సందర్భంగా విద్యార్థులకు వేమన శతకంపై పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు చిలుకూరి పద్మశ్రీదేవి, వలవల రాజేశ్వరి, కె పద్మావతి, చొడెం వీరాస్వామి, గొల్లమందుల రాజు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పెనుగొండ: గడపగడపకూ మన ప్రభుత్వంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం తూర్పుపాలెంలో ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. పెనుగొండ మార్టేరు రహదారి సమస్య పరిష్కరించామన్నారు. పెనుగొండ దేవ రహదారి విస్తరణ, ఆచంట సిద్ధాంతం రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా దొంగరావిపాలెం టోకు మార్కెట్ వద్ద సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేశామని, వీటితో పాటు గడపగడపకూ మన ప్రభుత్వంలో గ్రామాల్లో రహదారుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీంతో పాటు డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టి మురుగు సమస్య పరిష్కరించాలన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీల్లో విద్యుత్ సదుపాయం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు, ఇప్పటికే కొన్ని కాలనీల్లో విద్యుత్ మీటర్లు అందించాన్నారు.


తూర్పుపాలెంలో అధికారులతో సమీక్ష చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

రంగనాథరాజుకు ఇంటింటా సత్కారం

పెనుమంట్ర: నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో అత్తిలి శాసన సభ్యునిగా, నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆచంట శాసన సభ్యుడిగానూ, మంత్రిగానూ పెనుమంట్ర గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేయడమే కాకుండా గ్రామంలో అత్యధిక శాతం పేదప్రజలు ఇండ్లస్థలాలు గృహాలు నిర్మించి ఇవ్వడంపై పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజును అభినందిస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికి వెళుతున్న ఆయనను గ్రామస్తులు అభినందిస్తూ శాలువాలు, పూలమాలలతో సత్కరిస్తున్నారు. గ్రామంలో నాడు–నేడు సుమారు 20 ఎకరాలు పైగా స్థలసేకరణ చేపట్టి, సుమారు 600 కుటుంబాలకు పైగా ఇండ్లస్థలాల పట్టాలు మంజూరు చేసి, గృహాలు కూడా నిర్మించి ఇచ్చారని వైఎస్సార్ సీపీ నాయకులు చెబుతున్నారు. ఇదంతా తన గొప్పతనం కాదని, జగనన్న ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తనకు గుర్తింపు తెస్తున్నాయని రంగనాథరాజు తెలిపారు.

వైభవంగా అమ్మవార్ల జాతరలు


పాలమూరులో భక్తులు నిప్పులగుండం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పాలమూరు గ్రామంలో ఉన్న శ్రీ మారెమ్మ, శ్రీ నిలువులమ్మ, శ్రీ మహంకాళమ్మ వార్ల జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఊయల స్తంభాల వద్ద అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. సుమారు 150 మంది భక్తులు నిప్పులగుండం తొక్కారు. అనంతరం అమ్మవార్లను గుడికి సాగనంపారు. అనంతరం అమ్మవార్లకు భక్తులు అందజేసిన చీరలను వేలం వేశారు. ఈ చీరలు పాడుకోవడానికి మహిళలు పోటీ పడ్డారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పణతుల వీరాస్వామి, ఉపాధ్యక్షుడు పాలా విజయ భాస్కర్, కార్యదర్శి పంచదార అన్నవరం పాల్గొన్నారు.

కొమ్ముచిక్కాలలో

పోడూరు: మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామంలో శ్రీ కోట్లమ్మవారి జాతర వేడుక బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగల నృత్యాలు, మేళతాళ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా చేశారు. గ్రామస్తులు చలివిడి పాన్పులతో నైవేధ్యాలు సమర్పించారు. గురువారం తెల్లవారు జాము వరకు జాతర వేడుక జరిగింది. గ్రామస్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

22న శ్రీశైలం కర్ణభక్త సత్రం కమిటీ మహాజన సభ

పాలకొల్లు సెంట్రల్: శ్రీ కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశైలం సత్రం కమిటీ మహాజన సభ నిర్వహించనున్నట్లు సత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి శాగా రాంబాబు గురువారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు పట్టణంలోని అద్దేపల్లి వారి సత్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ముఖ్యంగా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా సత్రంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమాలు, నూతన కమిటీలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సత్రం గౌరవ అధ్యక్షులు శలా కోటి వీరయ్య, అధ్యక్షులు పొన్నా మల్లిఖార్జునరావులు పాల్గొంటారన్నారు. కర్ణభక్త సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు అందరూ ఈ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

బాధితురాలికి ఇన్సూరెన్స్ అందజేత

పాలకొల్లు సెంట్రల్: రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలసీ దారుని కుటుంబ సభ్యులైన నామినీకి రూ. 15 లక్షలు చెక్‌ను అందించినట్లు ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సీనియర్ డివిజనల్ మేనేజర్ బీఎస్‌జీకే మోహన్ గురువారం తెలిపారు. గతంలో పాలకొల్లు ది న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీలో పోడూరు మండలం గుమ్ములూరు గ్రామం కొమ్మువారి పాలెం ప్రాంతానికి చెందిన కుడిపూడి పాండురంగారావు గూడ్స్ కొరియర్ వాహనానికి కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలసీదారుడు మృతి చెందడంతో డ్రైవర్ మరియు ఓనర్ పర్సనల్ యాక్సిడెంట్ కవరేజ్ రూ. 15 లక్షలు వచ్చింది. పాలసీదారుడు నామినీ అయిన అతని భార్య కుడిపూడి లక్ష్మీకి చెక్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఇ.అచ్చారావు పాల్గొన్నారు.

22న చాంబర్స్ కళాశాలలో మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ పర్యవేక్షణలో కేవీఎం చాంబర్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గురువారం కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాల ప్రాంగణంలో ఈ టెస్ట్ నిర్వహించనున్నామన్నారు. ఈ మెరిట్ టెస్ట్ వల్ల విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. ఈ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 20, రూ. 15, రూ. 10 వేలు బహుమతులు అలాగే కన్సోలేషన్ బహుమతులుగా 11 మందికి రూ. 5 వేలు చొప్పున ఫీజులో రాయితీ ఇస్తామన్నారు. పరీక్షలకు ఎలాంటి ప్రవేశ రుసుములు లేవన్నారు. పరీక్షకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు కోసం 93985 75721, 90302 23014కు ఫోన్ చేయాలని సూచించారు.

బల్లల పూజల ప్రారంభం

పెనుగొండ: రజకుల సంక్రాంతి బల్లల పూజలు ప్రారంభమయ్యాయి. సిద్ధాంతంలో ఈ నెల 30వ తేదీ వరకూ పూజలు నిర్వహించడానికి గానూ, రజకుల కుల వృత్తికి విరామం ప్రకటించినట్లు సిద్ధాంతం రజక జన సేవా సంఘం నాయకులు తెలిపారు. 29న రజకుల ఇలవేల్పు ముసలమ్మ తల్లి అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, నైవేద్యాల సమర్పించిన అనంతరం ఈనెల 31న తిరిగి పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సహకరించాలని కోరారు.

జింక్ లోపానికి, అగ్గి తెగులుకు తేడా తెలుసుకోవాలి

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాలలో దాళ్వా పంటలో జింక్ ధాతు లోపం కనిపిస్తుందని, దీనినే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి అగ్గితెగులు నివారణ మందులు పిచికారి చేస్తున్నారని, ఆ విధంగా చేయవద్దని నరసాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఈద అనిలకుమారి కోరారు. యలమంచిలి, చించినాడ గ్రామాలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జింక్ లోపం వచ్చిన వరి కంకి పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల మధ్యలో ఈనె పాలిపోతుందన్నారు. నాట్లు పూర్తయిన రెండు నుంచి నాలుగు వారాలలో ముదురు ఆకు చివరలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనపడతాయన్నారు. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయన్నారు. మొక్కలు సరిగా దుబ్బు చేయవన్నారు. ఈ లోపం కనిపించగానే కొంతమంది రైతులు అగ్గితెగులుగా భావించి నివారణ మందులు పిచికారి చేస్తున్నారన్నారు. కానీ ఈ లక్షణాలను జింక్ ధాతు లోపంగా భావించి నివారణకు లీటరు నీటిలో రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ స్వప్న, నవ్య పాల్గొన్నారు.


వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

ప్రతీ రైతు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

మొగల్తూరు: ప్రతి రైతు తాము పండించిన పంటను ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏడీఏ అనిల్ కుమారి సూచించారు. గురువారం రామన్నపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడారు. రైతులు తమ పంటను ఈక్రాప్‌లో నమోదు చేయించుకుంటే కేంద్ర,రాష్ట్ర పభుత్వాలు అందిస్తున్న పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఆమె వెంట ఏఓ ఎం.సుజాత, వ్యవసాయ సిబ్బంది కావ్య, సుధ, సత్యప్రకాష్ తదితరులు ఉన్నారు.